లేత హృదయాలు

రచన:

శ్రీమతి కామరాజు మైత్రేయి

పిల్లలూ రండి. నా ఆఖరుఘడియలు సమీపించినట్లు వుంది. ఆ శాలువ యిలా అందుకోండి. నే కూచోటానికి ప్రయత్నిస్తాను. ఇలా దగ్గరకు రండి! మిమ్మల్లను దగ్గరగా తీసికుని చాల కబుర్లు చెప్పాలి. మీరు జాగ్రత్తగ నేను చెప్పినట్లు వినాలి.

పిల్లలు శాలువ తెచ్చి మంచము దగ్గరకు అందిచ్చారు. క్షీణదశలో వున్న ఆవిడ, ఆ శాలువ భుజాల మీదికి బాగా కప్పుకున్నది. రామం శారదకంటె రెండేళ్లు పెద్ద. కాని చాల విషయాల్లో అమాయకముగా వుంటాడు. వాడు మొదట అమ్మదగ్గర కూర్చున్నాడు. తన భుజముమీద ఆన్చిన తలను, తల్లి ప్రేమతో నిమిరింది. శారద ఒక్క నిమిషము తటపటాయించి తను అమ్మ ప్రక్కకు సర్దుకుంది. "నిన్న దేనినిగురించి మాట్లాడేమో మీకు తెలుసుకదూ" అంది అమ్మ. ఔనన్నట్లు తలూపారు పిల్లలిద్దరు.

రామం పది రూపాయలు తీసికుని, నీవు శారద కలిసి పిన్ని దగ్గరకు వెళ్లండి. వాళ్ల టామీతో ఆడుకుంటే ఎంతో బాగుంటుంది కదూ! పిల్లలు తలూచారు: వీళ్లకి తెలుసు, టామీ బలేహుషారైన కుక్కపిల్లని. ఎప్పుడు అల్లరికోసము ఎదురుచూస్తూ వుంటుందని, నోటితో బంతిని పట్టుకుని పరిగెట్టకలదని. కాని, వీళ్లకి తృప్తిగా, దానితో ఆడుకోవటము కుదరలేదు. అమ్మ ఎప్పుడోగాని తనని తీసికుని పిన్నిగారింటికి వెళ్లేది కాదు.

సరే! మీరింక పిన్నిగారింట్లోనే వుండి, మీ యిష్టము వచ్చినంతసేపు టామీతో ఆడుకోవచ్చు. అక్కడే పడుకోవచ్చు. టామీ మీతోటే వుంటుంది. అవుతే మీరు భయపడకండా వుంటారు కదూ!

పిల్లలిద్దరు "ఊ" నని ఒకేమాటు అన్నారు. "అమ్మ మీతో కూడా రాదు. మీరు పెద్దవాళ్లలాగ నడుచుకోవాలి. రాత్రిళ్లు మీకు దాహమువేస్తే పిన్నిని నిద్రనుండి లేపకుండ మీరే దీపము వెలిగించుకుని, మంచినీళ్లు త్రాగాలి. పిన్నికి మీరంటే ఎంతో యిష్టము, మిమ్మల్లను ఎంతో ప్రేమగా చూస్తుంది, మీరుకూడ పిన్ని చెప్పినట్లు వింటూ, అందరిమీద ప్రేమగా వుండాలి. పిన్ని మిమ్మల్లను ముద్దుగ చూస్తుంది, బడికి పంపుతుంది. మీకు మిగత పిల్లల్లాగ బడికివెళ్లి చదువుకోవాలని వుంది కదూ!"

అవును అమ్మా! అన్నారు రాము, శారద కూడ. "నాన్నలూ, పిన్ని ఎక్కడ వుంటుందో, మీకు గుర్తుందా?"

"గుంటూరు" అన్నారు యిద్దరు.

అక్కడకు ఎలా వెళ్లాలో మీకు తెలుసునా? ఓ అని తలూపారు పిల్లలు.

రామం! బీరువాలోని పది రూపాయలనోటు తీసుకొని, అందులో పెట్టె పట్టుకురా! నాన్నా.

రామం లేచి డబ్బు, బీరువాసొరుగులోని పెట్టె తెచ్చి అమ్మకు అందిచ్చాడు.

నోటు పోగొట్టుకొనవు కదా! ఎక్కడ పెట్టుకుంటావో చూస్తాను. సరే! శారదా నీవు చూడు, వాడు ఏ జేబులో పెట్టుకున్నాడో, నీకు జ్ఞాపకం వుంటుంది. ఇంక తనదగ్గరవున్న పెట్టె తెరిచింది ఆవిడ. ఇటు చూడండి, ఒక ముఖ్యమైన విషయము చెప్పాలి మీకు — ఈ కార్డు చూచారా, దీనిలో ఏమి వ్రాసి వుందో చదువుతాను జాగ్రత్తగ వినండి.

కె|| రాఘవేంద్రరావు, 27వి పట్టాభిపురం, గుంటూరు. ఇది పిన్ని వాళ్ల అడ్రెసు. ఈ కార్డు జాగ్రత్తగ దాచుకోండి. మీరు వెళ్లేది అక్కడకే.

స్టేషనుకు వెళ్లి గుంటూరుకు టిక్కెట్టు కొనుక్కొని భద్రముగ, టిక్కెట్టు కలెక్టరు సాయంతో బండి ఎక్కండి. గుంటూరులో బండిదిగి, యీ కార్డుమీది అడ్రెసును చూపి యింటికి వెళ్లండి. ఇదిగో రామం యీ వుత్తరం వెళ్లగనే పిన్నికి యివ్వు. ఇది నీ పెట్టెలో దాచుకో. మీరు స్టేషనులోకాని, వెళ్లేప్పుడుకాని దిక్కులు చూడకండ, రోడ్డు జాగ్రత్తగ దాటండి. యిద్దరు చేతులు పట్టుకొని మరీ వెళ్లండి.

సరేలే, అమ్మా!

ఇప్పుడు మీ యిద్దరికీ చక్కటి తాయిలాలు యిస్తాను. రామం యిటురా. ఇదిగో మీ నాన్న జేబు

గడియారము గొలుసు. ఇది నీకు. యిప్పుడు నేను దీనికి కీ యిస్తాను చూడు. రేపటినుంచి నీవే యిచ్చుకోవాలి అంటూ ఆవిడ ఆ గడియారాన్ని రామం జేబులో వుంచింది. గొలుసు కోటుబైటకు తగిలించింది. నాన్న పేరేమిటో మీకు జ్ఞాపకము వుంది కదా! ఆ! నారాయణమూర్తిగారు అన్నారు యిద్దరు ఒకేమాటుగా. సరి! ఎప్పటికి నాన్నను మరవకండి. ఇదిగో శారదా మీ అమ్మమ్మగారి గొలుసు, ఆ గొలుసుతోపాటు నా వుంగరముకూడ అందులో వుంచుతాను. పెద్దదానవైన తర్వాత వేలికి వుంచుకుందువుగాని అంటూ తన వ్రేలివుంగరము తీసి గొలుసులో వేసి పిల్ల మెడలో పెట్టింది. ఎంత చక్కగ వుండే తల్లి! ఇదే నేను నీకీయకలిగినది. ఇప్పట్లో మీ అమ్మ మీకీయకలిగిన మంచివస్తువు మిమ్ములను తిరిగి బడికి పంపగలగడమే! మిమ్ములను చాలరోజులు బడి మాన్పించాను. మీరు ఎంతో శ్రద్ధా, ప్రేమలతో నాకు సేవచేశారు. ప్రేమ, శ్రద్ధలే మందులై వుంటే, యీపాటికి నాజబ్బు నిమ్మళించేది. మీరు తిరిగి బళ్లోకి వెళ్లండి. పిన్ని, బాబాయి మిమ్ములను లాలనగా చూస్తారు. నేను ఎక్కడకో చాల, చాల దూరము వెళ్లిపోతాను.

చాల దూరమా? అంది శారద.

అవును చాలదూరము.

మమ్ములను అప్పుడప్పుడు వచ్చి చూస్తావా?

ప్రయత్నిస్తాను. ఎలాగో ప్రయత్నిస్తాను. కాని పిల్లలూ! మీరు మాత్రము చక్కగ, బుద్ధిమంతుల్లాగ వుండాలి. పెద్దవారైతే మీకు తెలుస్తుంది. రామూ! నీవు చెల్లెలిని ప్రేమగా చూచుకుంటానని మాట యివ్వు. చెల్లికూడ, నాలాగే నిన్ను ప్రేమతో చూస్తుంది. మీరిద్దరు యేవిషయముల్లోనూ పోట్లాడుకోకూడదు. మీరిద్దరు కలిసికట్టుగా వుంటే లోకాన్ని ఎదిరించేశక్తి వస్తుంది తెలిసిందా? అలాగే, కలిసి మెలిసి వుంటామని నాకు మాట యివ్వండి.

అలాగే వుంటాము అమ్మా!

శారదా! నీవుకూడ పెద్దదానవై, నాలాగే అన్నయ్యను జాగ్రత్తగ చూసుకుంటావు కదూ?

అలాగే అని తలూపింది శారద.

నేను యింతకంటె యెక్కువ చెప్పలేను. చెప్పినా మీరు మఱచిపోతారు. ఇంకొకమాట మీరు యెప్పుడు కాని ధైర్యాన్ని వదలిపెట్టకండి. ఒక్కమాటు నా దగ్గరకు వచ్చి నాకొక్క ముద్దు యిచ్చిపోండి.

పిల్లలిద్దర్ని పక్కన చేర్చుకుని తనివితీర ముద్దు పెట్టుకుంది. దానితోటే ఆవిడలోని శక్తి అంతా పూర్తి అయినట్లు, మంచము మీదకు వాలిపోయి, పెట్టెలు పుచ్చుకుని వెళ్లిపోతుండే తన పిల్లలకు హీన స్వరముతో, ధైర్యముగ వుండండి పిల్లలూ, అంటూ వుండిపోయింది. నేను ధైర్యముగ వుంటాను.

అలాగే అమ్మా అన్నారు పిల్లలిద్దరు. తలుపు ఓరగవేసి వెళ్లండి. రామం! శారద చేయిపుచ్చుకో. దేవుడు మిమ్ములను కాపాడుతాడు అంటూ ఆవిడ, వచ్చేదుఃఖాన్ని ఆపుకుంటూ, వెళ్లే పిల్లలకు చేయి వూపి, పోయిరమ్మని, శెలవు యిచ్చింది. పిల్లలుకూడ వెనుదిరిగి, అమ్మ శుష్కమైన నవ్వు మొహాన్ని చూసి వారు నవ్వు మొహము పెట్టేరు. తలుపు దగ్గర సావేసి, పిల్లలు వెళ్లిపోయేరు.

శారద మెట్లు దిగుతూ యింకొకమాటు "వెళ్లి వస్తామమ్మా" అంది. రామం 'పదపద! ఆవిడ నిన్ను యిక్కడనుంచి చూడలేదే' అన్నాడు.

తలుపుమూసి పిల్లలు వెళ్లిపోగానే, ఆవిడ యిక వుండలేక పోయినది. రెండు చేతులతో ముఖము కప్పుకొని వెక్కివెక్కి తన హృదయములోని దుఃఖాన్ని వెళ్లబోసుకుంది. తననుంచి యీ చివరి బంధము తెగిపోయినదని తెలుసుకుని ఆవిడ నిశ్చింతగ కళ్లుమూసుకుని పడుకుంది.

ఇంటికి రెండు వీధుల అవతలవుంది స్టేషను. శారద, రామం ఒకరిచేయి ఒకరుపుచ్చుకొని, యీ విశాల ప్రపంచములోకి నడుస్తున్నారు. మధ్య మధ్య షాపుల కిటికీల్లోకి చూస్తూ నిలబడిపోయిన, శారదను "పద చెల్లీ" అన్నాడు రామం, స్టేషను చేరగనే, తన దగ్గరవున్న పావలా పెట్టి రామం రెండు లాలీ పాపులు కొన్నాడు. చెర్రి ఒకటి తింటూ స్టేషనులోకి వెళ్లేరు.

బుకింగు కిటికీ దగ్గరకు వెళ్లి రామం పది రూపాయల నోటుయిచ్చి రెండు టిక్కెట్లు గుంటూరుకు కొన్నాడు. మిగతాడబ్బులు జేబులో వుంచుకున్నాడు. టిక్కెట్లు, టిక్కెట్టుకలెక్టరుకు చూపించారు. అతను, పిల్లలిద్దర్ని బండిలో కూర్చోబెట్టాడు. రామం, ఒకమాటు తన జేబుగడియారము పైకితీసి స్టేషనుటైముకు సరిదిద్దుకున్నాడు. శారద తనలాలీ పాపుచీకుతూ రామంవైపు చూస్తూకూచుంది. ఎదర కూచున్న పెద్దవయసు అతను, "మీ అమ్మగారు మీతో

రాలేదా" అని అడిగాడు. "మా అమ్మగారు వెళ్ళిపోయినారు."

వేరేవూరు వెళ్లేరా ? — అవును.
ఏవూరు వెళ్లేరు ?

మనుష్యులు చచ్చిపోతే యెక్కడికో అక్కడికి.
హారే, దైవమా ! అక్కడికా ?

అవును. మా అమ్మకు చెప్పటము యిష్టము లేదు కాని ? మాకు తెలుసు, అన్నారు యిద్దరూ.

3

పిల్లలు గేటు తెరుచుకుని, రావడము చూసినటామీ ఎగిరి గంతేసి, గడ్డిలో దాచివుంచిన రబ్బరు బంతిని నోట్లో కరుచుకునివచ్చి పిల్లలను ఆటకు పిలిచింది. అప్పుడే, బయటకువచ్చిన పిన్ని పిల్లలను చూచి "ఎప్పుడు వచ్చారర్రా మీరు చిట్టిబాబులు" అని పిల్లలను దగ్గరకులాలనగ తీసుకుంది. "బహుశా! మీ అమ్మ మిమ్మలను యిక్కడికి పంపిందేమో మీరంటే మాకెంతో యిష్టమని ఆవిడకు తెలుసు." పిల్లలు జవాబు చెప్పలేదు.

అమ్మ బాగుందా ?

"ఓ" అని రామం తలూపాడు. "లోపలికిరండి పాలు రొట్టె, పండ్లు తిందురుగాని, ప్రొద్దున ఎప్పుడు తిన్నారో" అని పిన్ని వాళ్లకు రొట్టె, పాలు, పండ్లు యిచ్చింది. శారద, రామం, టామీతో ఆడుకోవడముకోసము, టిఫిను తొందరగ, తొందరగ పూర్తి చేసుకుని బయటకువచ్చేరు. ఒక గంటసేపు కుక్కతోటి కులాసాగా గంతులేసేరు.

రామానికి అమ్మ యిచ్చిన జాబు సంగతి చటుక్కున జ్ఞాపకమువచ్చి, శారదకు చెప్పేడు. శారద గబగబ లోపలికెళ్లి తనపెట్టె తెరచి జాబుతీసి పిన్నికిచ్చింది. అమ్మ తన కిచ్చిన జాబు.

'ఏమిటిది,' అంది పిన్ని.

అమ్మ వుత్తరము యిచ్చింది? అంది శారద.

పిన్ని వుత్తరము చింపి చదివింది.

చి|| సౌ|| సీతకు :—

అనేక, ఆశీర్వచనములు. నేను వెళ్ళేచోటికి పిల్లలను తీసికెళ్ళలేను? అంచేత నీవద్దకు పంపుతున్నాను. నా విషయమున నీకేది నచ్చదని తెలుసు. నేను ఇబ్బుస్థితిలో వున్నాను. నీవు వ్రాసే, సూటి పోటి మాటలు వినేస్థితిలో లేను, వాటి వుపయోగము కనిపించనందున, నీ చివరి వుత్తరాలు చింపకుండగనే, నీకు తిరిగి పంపివేసేను. అవును! చెల్లీ! నేను ఒక త్రాగుబోతును పెండ్లాడేను. ఆయన వున్నప్పుడు! మేమెంతో ఆనందంగా రోజులు గడిపాము. ఈ విషయము నీకు తెలియదు. తెలిసినా నీకు అర్థముకాదు. మీవారు నీకు, చీరెలు, నగలు, ఐశ్వర్యము యిచ్చారు. మావారు నాకు, బీదరికము, వైధవ్యము యిచ్చారు. కాని నాకు పిల్లలున్నారు. ఇంతవరకు, ఎలాగో జీవితాన్ని గడిపాను.

సీతా! పిల్లలు, అమాయకులు. నామీద కోపము వాళ్లమీద చూపించబోకు. మృత్యువును విమర్శించవద్దు. పిల్లలను ప్రేమతో చూస్తే వాళ్లే నీకు ఆనందాన్ని యిస్తారు. జీవితాన్ని సుఖమయము చేస్తారు. ఇంతకంటె ఏమి వ్రాయలేను. పిల్లలే, నా సర్వస్వము. వారిని ప్రేమతో ఆదరించు.

ఇట్లు :
లక్ష్మి,

పిన్ని వుత్తరము చదివేవరకు, ఆవిడనే చూస్తూ నిలబడింది శారద.

"ఇందులో ఏమివుందో తెలుసా" అంది పిన్ని. తెలుసు అన్నట్లు తలూపింది శారద. పిల్లలను దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుంది. శారద మెడలో గొలుసు కూడ చూచింది.

సీత, భర్తను పిలవడానికి ఫోనుదగ్గరకు వెళ్లింది. భర్తఫోను దగ్గరకురాగానే.

మీరింకా ఆఫీసులో వున్నారా? ఎందుకు? శారద, రామం, కొద్దిసేపటికి క్రిందనే యిక్కడకు వచ్చేరు.

"చాల సంతోషము, ఇప్పటికైన, మీ అక్కయ్యతో రాజీ పడ్డావన్నమాట. పిల్లలనుగురించి నాకు బెంగగానే వుంది." రాఘవేంద్రరావుకూడ, శారద,. రామం అంటే యెంతో ప్రేమ.

"నేను అక్కయ్యతో రాజీ పడలేదు. పిల్లలు అచ్చగా యిక్కడికే వచ్చేసారు. కొద్ది సేపట్లో మీకే తెలుస్తుంది. వెంటనే మీరు కారులో బెజవాడ వెళ్లి పరిస్థితులు చూసిరండి."

4

మృత్యుదేవత. రాఘవేంద్ర కన్ను మూయగానే

లక్ష్మి గదిలో ప్రవేశించింది. తలుపుమాత్రము ఓరగా వేసివుంది.

రాఘవేంద్రరావు లక్ష్మి అంత్య క్రియలు చేసి యింటికి తిరిగి వెళ్లేటప్పటికి, చాల ప్రొద్దుపోయింది.

"అక్కయ్యా ఎలా వుంది."

"నేను వెళ్లేప్పటికే పోయింది. ఆవిడకు చేయ వలసినవన్నీ చేసివచ్చేను. పిల్లలు పడుకున్నారా?"

"ఆ, పడుకున్నారు."

"బాబాయి" అంటూ మేడమీదనుంచి పిల్లలు పిలిచారు. వస్తున్నాన్రా అంటూ రాఘవేంద్ర రావు గబగబ మేడమీద్దికి వెళ్లేడు. పిల్లలు మేలుకునే వున్నారు. తనువచ్చేప్పటికి వాళ్లు మెలుకువగా వున్నందుకు, అతనికి యెంతో సంతోషము వేసింది. పిల్లలిద్దరు బాబాయి మీద్దికి, ఎగబడి మెడచుట్టు వేసి, యిద్దరు ఒకేమాటు బాబాయితో చిలిపి కబుర్లు, ముద్దుముద్దుగ చెప్పడము మొదలెట్టారు. టామీతో, వారు ఆడుకున్న కబుర్లు, వారు దానికి నేర్పిన కొత్త విద్యలు, ఒకరికంటె ఒకరు, ముందు చెప్పాకు పోసాగారు. సరదాగా కబుర్లు చెబుతునే, మధ్యలో, శారద "బాబాయి అమ్మను చూచావా?" అని అడిగింది.

బాబాయి జవాబు చెప్పలేదు.

"మమ్మల్ని ధైర్యముగ వుండమంది మా అమ్మ, మా కంతా తెలుసులే" అన్నాడు రామం.

"ఏమిటి తెలుసునురా." అన్నాడు బాబాయి.

అమ్మ చాలదూరము వెడుతుందని, దేవుడిని చూడటాని వెడుతుందని మాకు తెలుసునులే? ఆవిడ వెళ్లిందా? "ఆ వెళ్లింది." అంతకంటె ఏమియొక్కువ చెప్పలేకపోయినాడు.

పిల్లలు, ప్రక్కలమీదకు వెళ్లి అమాయికంగా, తీయటి కలలుకంటూ నిద్రపోయారు.

5

తెల్లారింది అప్పటికే టామి వంటింటి గడపలోతన వాటా రొట్టె పాలకోసము నిలబడివుంది. పిల్లలు టామీకూడ, గబగబ తినేసి, ఆడుకోటానికి బయలుకు పరిగెట్టిపోయారు. ఆటల్లోవాళ్ళకు తీరుబడే లేదు. ఒక నిమిషము శారద. "రామం, అమ్మ యింకరాదా" అన్నది, రామం, "అమ్మ యింక రాదు" అన్నాడు.

"విశాల ప్రపంచమంటే ఏమిటే" అన్నాడు రామం. "నాకు తెలియదురా" అంది శారద.

తిరిగి వాళ్లు టామీతో ఆటలో మునిగిపోయారు.

—o—

ఒకరసిక భక్తాగ్రేసరుడు దారిననడుస్తూ ఒకయింటిముందు నిలబడి యింట్లో యిల్లాలు పాడుతున్న పాటవిని తన్మయుడౌతుంటాడు. కొంతసేపటికి ఆయిల్లాలు బయటికి వస్తుంది.

"ఆహా! ఏమిపాట తల్లీ! భక్తి రసం ఉట్టిపడుతున్నది. అది వింటున్నంతసేపు పరమాత్మతో ఐక్యమైపోయి ఆనందడోలికలలో నూగిసలాడినట్లయింది"

ఆ యిల్లాలు "అదాండీ! - రోజూ కోడిగ్రుడ్లు ఉడకబెడుతూ పాడే పాటే" అన్నది తేలికగా.

బొడ్డుపల్లి వేంకటప్పయ్యశర్మ